

నేటి నుంచి అఖిల భారత స్థాయి నాటిక పోటీలు

వీరవాసరం : వీరవాసరం కళాపరిషత్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి అఖిల భారత స్థాయి నాటిక పోటీలు ప్రారంభంకానున్నాయి. 27వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీలను కీర్తిశేషులు గుండా లక్ష్మీరత్నానికి కళావేదికపై చిలకమర్తి కళాప్రాంగణంలో నాటికలు ప్రదర్శించనున్నారు. 24న దేవుడు కనిపించాడు, 25న అనూహ్యం, ఆకతాయిశివ, 26న దేవరగం, అసత్యం, 27న అంగీకం భువనం యస్య, తీరమెల్లి పోతున్నాతో వంటి సామాజిక ఇతివృత్తాలతో నాటికలను ప్రదర్శించనున్నారు. సినీ నటి, కీర్తిశేషులు సావిత్రి పేరున ఉత్తమ నటి అవార్డు, కీర్తిశేషులు దాసరినారాయణ పేరున ఉత్తమ దర్శకుడు అవార్డులను, కొల్లా వీరరాఘవులు, భాగ్యలక్ష్మమ్మ దంపతులు జ్ఞాపకార్థం వారి కుమారుడు కొల్లా శ్రీహరి ఉత్తమ ప్రథమ బహుమతి, గుండా నరసింహారావు ఆర్థిక సహకారంతో ద్వితీయ బహుమతులు అందజేయనున్నట్లు కళాపరిషత్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ తెలిపారు. ప్రముఖులు, రాజకీయ నాయకులు సత్కరించనున్నట్లు తెలిపారు.

జిల్లా పరిషత్‌లో.. ఏం జరుగుతోంది..!


రద్దుచేసిన అకౌంట్ ఆఫీసర్ పోస్టులో ప్రత్యేకంగా అధికారి నియామకం
జిల్లా కలెక్టర్, రాష్ట్ర స్థాయి అధికారుల అనుమతులు ఉన్నాయా
ఒకే అధికారికి మూడు పోస్టులు అప్పగింత వెనుక రహస్యం ఏంటి?
జెడ్‌పి సిఇఒ సెలవు వెనుక రాజకీయ నాయకుల ఒత్తిడే కారణమా
నిబంధనలకు విరుద్ధంగా సంతకాలు పెట్టలేక సిఇఒ సెలవుపై వెళ్లారంటూ చర్చ
సెలవు దినంలో జెడ్‌పి ఆవరణలో ఏళ్లనాటి చెట్లు నరికివేతకు ప్రణాళిక
ఆర్థిక సంఘం నిధులపైనా నేతల కన్ను పడిందా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజానీకానికి తలమానికంగా ఉండే జిల్లా పరిషత్ (జెడ్‌పి) కార్యాలయంలో జరుగుతున్న పరిణామాలు తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయి. అసలు జెడ్‌పి కార్యాలయంలో ఏం జరుగుతోందంటూ అందరిలోనూ చర్చ కొనసాగుతోంది. నిబంధనలను కాలరాసి నాయకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాల విభజన జరిగినప్పటికీ జిల్లా పరిషత్ మాత్రం ఉమ్మడి పశ్చిమ గోదావరిగానే ఉంది. జిల్లా పరిషత్ పరిధిలో మొత్తం 48 మండలాలు ఉన్నాయి. దాదాపు 40 లక్షల మంది జనాభాకు సంబంధించిన నిర్ణయాలన్నీ జెడ్‌పిలో జరుగుతాయి. అలాంటి కార్యాలయం కొంతకాలంగా వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. గత ప్రభుత్వం 2020లో ప్రత్యేక జిఒ తీసుకొచ్చి జిల్లా పరిషత్‌లో అకౌంట్ ఆఫీసర్ (గణాంకాఅధికారి) పోస్టును రద్దు చేసింది. డివిజన్ల వారీగా డిఎల్‌డిఒ (డివిజనల్ డవలప్‌మెంట్ ఆఫీసర్) పోస్టులను తీసుకొచ్చింది. దీంతో పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ అకౌంట్ ఆఫీసర్ పోస్టు సైతం రద్దయ్యింది. రద్దయిన అకౌంట్ ఆఫీసర్ పోస్టులో ఇప్పుడు ప్రత్యేకంగా ఓ అధికారిని (ఎఫ్ఎసి) నియమించడంతోపాటు, ప్రత్యేక ఛాంబర్ కేటాయించడం, సదరు అధికారికి ఆఫీస్ సబార్డినేట్ (అటెండర్)ను సైతం కేటాయించడం చూసి అంతా నివ్వెరపోతున్నారు. రద్దయిన పోస్టులో ప్రత్యేకంగా అధికారిని ఏవిధంగా నియమిస్తారో ఏ ఒక్కరికీ అర్థం కావడం లేదు. అకౌంట్ ఆఫీసర్‌గా నియమించిన వ్యక్తి ఇప్పటికే రెండు పోస్టుల్లో పనిచేస్తున్నారు. జెడ్‌పిలో ఎఒ (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)గాను, ద్వారకాతిరుమల ఎంపిడిఒ (ఎఫ్ఎసి)గా పనిచేస్తున్నారు. ఇప్పుడు సదరు అధికారిని అకౌంట్ ఆఫీసర్‌గా నియమించారు. రద్దయిన అకౌంట్ ఆఫీసర్ నియామకం కొత్తగా జరగాలంటే జిల్లా కలెక్టర్, ఆ శాఖ రాష్ట్రస్థాయి అధికారుల అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. అనుమతి తీసుకుని నియమించారా.. లేక వీరే ఇష్టానుసారంగా నియమించారో తేల్చాల్సి ఉంది. రద్దయిన పోస్టులకు అనుమతులు ఇచ్చే అవకాశం ఉండదని చెబుతున్నారు. అకౌంట్ ఆఫీసర్‌ను ఏవిధంగా నియమించారో జిల్లా పరిషత్ అధికారులు చెప్పాల్సి ఉంటుంది. కొత్తగా అకౌంట్ ఆఫీసర్ నియామకం నిబంధనల ప్రకారమే జరిగితే ఇంకా సీనియర్ అధికారులు చాలా మంది ఉన్నారు. దీని వెనుక మర్మం ఏంటో తేల్చాల్సి ఉంది.




జిల్లా పరిషత్ కార్యాలయం


అకౌంట్ ఆఫీసర్ ప్రత్యేక గది

సిఇఒ సెలవుపై వెళ్లారా.. బలవంతంగా పెట్టించారా?

జిల్లా పరిషత్ సిఇఒగా ఉన్న సుబ్బారావు కొద్దిరోజుల క్రితం సెలవుపై వెళ్లారు. వ్యక్తిగత సెలవుపై వెళ్లారని చెబుతున్నప్పటికీ వాస్తవం మాత్రం వేరే ఉందన్న చర్చ సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఫైల్స్‌పై సంతకాలు పెట్టలేక సిఇఒ సెలవుపై వెళ్లినట్లు తెలుస్తోంది. నాయకుల ఒత్తిడి తీవ్రతరం కావడంతో ఆయన సెలవు పెట్టినట్లు సమాచారం. ఆయన మళ్లీ తిరిగి విధుల్లో చేరే అవకాశం దాదాపుగా లేనట్లేనన్న చర్చ నడుస్తోంది. ఆయన వెళ్లిన వెంటనే అకౌంట్ ఆఫీసర్ పోస్టు ఏర్పాటు చకచకా జరిగిపోయినట్లు తెలుస్తోంది. జిల్లా పరిషత్ పాలకవర్గం పదవీకాలం ఇంకా దాదాపు ఏడాదిన్నర మాత్రమే ఉంది. దీంతో నాయకులు సంపాదించుకోవడమే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. అందులో భాగంగానే జెడ్‌పిలో అనేక పరిణామాలు చోటు చేసుకుంటున్నట్లు చర్చ నడుస్తోంది. 15వ ఆర్థిక సంఘం నిధులతో జిల్లా పరిషత్ పరిధిలో రూ.కోట్ల విలువ చేసే పనులు జరుగుతున్నాయి. తాము అనుకున్నట్లు ఆర్థిక లావాదేవీలు సాఫీగా జరిగేవిధంగా నాయకులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో నిబంధనలను బేఖాతరు చేస్తూ ముందుకు సాగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. గతంలో జెడ్‌పి సిఇఒగా ఉన్న అధికారి ఇష్టానుసారంగా వ్యవహరించారంటూ వివాదాలు కొనసాగాయి. అప్పట్లో ఆయన్ని ఉన్నతాధికారులు పక్కకు తప్పించడం జరిగింది. ఇప్పుడు మళ్లీ అదే తరహా వ్యవహారాలు సాగిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


నరికేసిన భారీ వృక్షాలు

సెలవు రోజు.. ఏళ్లనాటి చెట్లు నరికివేత

ఆదివారం సెలవు రోజున జిల్లా పరిషత్ ఆవరణలో ఉన్న ఏళ్లనాటి చెట్టును కొంతమంది వ్యక్తులు నరకడం హాట్‌టాపిక్‌గా మారింది. రాజకీయ నాయకుల కనుసన్నల్లో ఇదంతా జరిగిందన్న చర్చ సాగుతోంది. కొంతమంది చెట్లు నరికివేతను అడ్డుకుని ఆందోళన చేయడంతోపాటు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లా పరిషత్ అధికారులు మాత్రం తమకు తెలీదని సమాధానం చెప్పడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం చెట్లు నరికివేస్తారన్న ప్రచారం శనివారమే సాగింది. అన్నట్టుగానే ఆదివారం నరకడం ప్రారంభించారు. ఏళ్లనాటి చెట్టుకు సంబంధించి పెద్దకొమ్మ నరికేసమయానికి అడ్డుకోవడంతో, చెట్టు పూర్తిగా నరకకుండా అడ్డుకున్న పరిస్థితి నెలకొంది. చెట్లు నరికివేత నుంచి జిల్లా పరిషత్ జరుగుతున్న పరిణామాలు పలు అనుమానాలకు తావిస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు జిల్లా పరిషత్‌లో జరుగుతున్న పరిణామాలపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.


యలమంచిలి మండలంలో శిలాఫలకాన్ని ఆవిరిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

సురక్షిత నీరు అందించడమే ధ్యేయం

జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - యలమంచిలి


గత వైసిపి ప్రభుత్వ హయాంలో తాగునీటి పథకాలను నిర్లక్ష్యం చేసి కనీసం ప్రజలకు తాగునీరు అందించలేని దుర్భరమైన పరిస్థితి ఉండేదని, కూటమి ప్రభుత్వం జల జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో తాగునీటి పథకాలకు పూర్వవైభవం తీసుకొచ్చి స్వచ్ఛమైన తాగునీటిని రెండు పూటలా పుష్కలంగా అందిస్తామని మంత్రి రామానాయుడు అన్నారు. ఆదివారం యలమంచిలి మండలం కాజ పడమర, కాజ తూర్పు, ఊటాడ గ్రామాల్లో రూ.2.31 కోట్లతో జల జీవన్ మిషన్ ద్వారా తాగునీటి పథకాల అభివృద్ధి పనులకు మంత్రి భూమిపూజ చేసి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఆయనకు గ్రామాల్లో ప్రజలు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ జల జీవన మిషన్ ద్వారా రాష్ట్రంలో రూ.95.44 లక్షల కుటుంబాలకు కుళాయిల ఏర్పాటు ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. వైసిపి పాలనలో జల జీవన్ మిషన్ అమలుకు కేంద్రానికి కట్టాల్సిన రాష్ట్ర వాటాను ఎగ్గొట్టి, ఉన్న నిధులు పక్కదారి పట్టించారని అన్నారు. గత ఐదేళ్లల్లో జల జీవన్ మిషన్ ద్వారా కేవలం రూ.22.50 కోట్లు మాత్రమే ఖర్చు చేయడంతో పాటు 2024 నాటికి ముగిసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రధానితో సిఎం చంద్రబాబు మాట్లాడి 2027 వరకూ కొనసాగించడంతో పాటు కేంద్రాన్ని రూ.55 వేల కోట్లు అవసరమని కోరారని తెలిపారు. గత ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన రూ.1674 కోట్ల బకాయిలు ఎగ్గొడితే కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. రైతులకు ధాన్యం కొనుగోలు చేసిన సొమ్ములను 48 గంటల్లో చెల్లించి, రైతన్నలను ఆదుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గ్రంథి నాగవెంకట పవన్ కుమార్, ఎంపిడిఒ ఎ.ప్రేమాన్విత, డిఇ పి.శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి జక్కంశెట్టి దుర్గాప్రసాద్, అధికారులు, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ముందస్తు చర్యలు

జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఏప్రిల్ మొదటి వారంలో ధాన్యం కొనుగోలు చేయడానికి ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని మోదుగుగుంట గ్రామంలో వరి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. వరి కోతలు ఎన్ని రోజుల్లో వస్తాయని అడిగి తెలుసుకున్నారు. ఈ నెలాఖరు నుంచి వరి కోతలు మొదలవుతాయని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా జెసిమ మాట్లాడుతూ ఆర్ఎస్‌కెల ద్వారా ఏప్రిల్ మొదటివారం నుంచి ధాన్యం కొనుగోలు చేయడానికి ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రబీ సాగుకు సంబంధించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ మొదటి వారానికి సిద్ధం చేయాలని, రైతు సేవా కేంద్రాలకు సంబంధించిన సిబ్బంది పూర్తిస్థాయిలో నియమించాలని అధికారులను ఆదేశించారు. అలాగే గోనె సంచులు, జిపిఎస్ పరికరాలు, హమాలీలు, వాహనాలు, ఏర్పాటు చేసుకుని సిద్ధంగా ఉండాలన్నారు. కొనుగోలు కేంద్రాలు ద్వారా అన్ని రకాల ధాన్యం సేకరించటం జరుగుతుందన్నారు. 17 శాతం లోపు నాణ్యతా ప్రమాణాలను పాటించి శుద్ధి చేసిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాలకు తీసుకొచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ, ఎంఎఒ ఆర్ఎస్ ప్రసాద్, తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్, విఆర్‌ఒలు, రైతులు పాల్గొన్నారు.


పంటను పరిశీలిస్తున్న జెసి రాహుల్ కుమార్‌రెడ్డి

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి దుర్మార్గం

నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి
సెకితో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి
సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనకు సిద్ధం
సిపిఎం జిల్లా కమిటీ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి. బలరాం



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బలరాం

ప్రజాశక్తి - భీమవరం

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి అత్యంత దుర్మార్గమని, ఈ దాడిని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం అన్నారు. స్థానిక మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం హాజరయ్యారు. జాతీయ, అంతర్జాతీయ సమస్యలతో పాటు జిల్లాలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రధానంగా చర్చించారు. అనంతరం బలరాం మట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడిలో గతంలో 60 వేల మంది మృతి చెందారని, ఈ మూడు నాలుగు రోజుల్లో జరిగిన దాడుల్లో 600 మంది మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా ప్రోద్బలంతో ఇజ్రాయిల్ చేస్తున్న దుర్మార్గమైన దాడిని సిపిఎం జిల్లా కమిటీ సమావేశం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం గతం మాదిరిగానే పాలస్తీనాకే మద్దతు తెలిపాలి తప్ప ఇజ్రాయిల్‌కు వత్తాసుగా అమెరికా అడుగులకు మడుగులొత్తడం దారుణమన్నారు. బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మికులకు, కష్టజీవులకు అన్యాయం చేసే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ప్రకటించాలన్నారు. దేశ వ్యాప్తంగా రైతుల డిమాండ్స్ అమలు చేయాలన్నారు. ట్రూఅప్ ఛార్జీలను, ఇందన సర్దుబాటు ఛార్జీలను, స్మార్ట్ మీటర్లు, సెకి ఒప్పందాలు రద్దు చేయకుండా కొనసాగించడమంటే వారి అవినీతిలో టిడిపి, జనసేన భాగస్వాములైనట్లేనని విమర్శించారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల భారాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దాళ్వా కోతకు రాబోతోందని క్వింటాల్‌కు రూ.3 వేలు ఇవ్వాలని జిల్లా కమిటీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఏమాత్రమూ సరిపోదని, కేరళ, తమిళనాడు మాదిరిగా మహారాష్ట్ర, కర్ణాటకా వలే బోనస్‌లు ప్రకటించి ఇక్కడ అమలు చేయాలన్నారు. ఆక్వా రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని, కంపెనీలన్నీ సిండికేట్ అయ్యి ధర తగ్గించి రైతులకు నష్టపరుస్తున్నాయన్నారు. రైతులకు న్యాయం చేయాలని కోరారు., వీరికి విద్యుత్ రాయితీలను అమలు చేయాలన్నారు. ఉపాధి కూలీలకు వేతనాలు పెంచి పనులు చూపించాలన్నారు. కౌలురైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. వేసవిలో తాగు, సాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. దళితుల శ్మశాన సమస్యలను పరిష్కరించాలన్నారు. బెల్టు షాపులను నియంత్రించాలని కోరారు. విద్యార్థులకు పరీక్షల సమయంలో విద్యుత్ కోతలు లేకుండా చూడాలన్నారు నిరుద్యోగ యువతీ యువకులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. ఇళ్లు, ఇళ్ల స్థలాల సమస్యను, టిడ్కో ఇళ్ల సమస్యలను జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని కోరారు. ప్రజల సమస్యలను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఉద్యమాలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, బి.వాసుదేవరావు, కౌరు పెద్దిరాజు, పివి.ప్రతాప్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల సమస్య పరిష్కరించాలి : సిఐటియు

భీమవరం : గత పదేళ్ల నుంచి పనిచేస్తున్న ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల వేతనాన్ని పెంచాలని ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు, నాయకులు అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయిస్(సిఐటియు అనుబంధం) యూనియన్ సమావేశం జిల్లా అధ్యక్షులు ఎం.నాగార్జున అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు, నాయకులు మాట్లాడుతూ ఈనెల 31వ తేదీతో అరవిందో కాంట్రాక్టు ముగుస్తున్న సందర్భంగా రూ.18 వేలు వేతనాన్ని పెంచుతూ ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదేళ్ల నుంచి పనిచేస్తున్నా ఒక్క రూపాయి కూడా వేతనం పెంచకపోవడం దారుణమని నిరసన ప్రయత్నం చేశారు. వాహనాల రిపేర్లు చేయించకుండా వాటి మీద పనిచేయడం చాలా కష్టంగా ఉందని, రోజురోజుకి యాప్లు పెంచి, సెల్‌ఫోన్లు ఇవ్వకుండా పని భారాన్ని పెంచారని, వేతనాలు మాత్రం పెంచలేదని సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వమే నేరుగా జీతాలు ఇచ్చి ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ని రెగ్యులర్ చేయాలని, రోజురోజుకీ పెరుగుతున్న పని భారాన్ని తగ్గించాలని సమావేశం తీర్మానించింది.



నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

నూతన జిల్లా కమిటీ ఏర్పాటు

సమావేశం అనంతరం జిల్లాలో పనిచేస్తున్న ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు అందరూ సమావేశమై నూతన జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షులుగా ఎం.నాగార్జున, కార్యదర్శిగా పి.రాము, ఉపాధ్యక్షులుగా పంతం మణికంఠ, ట్రెజరర్‌గా పంతగాని అమర్ బాబులతో కమిటీని ఎన్నుకున్నారు. రాబోయే రోజుల్లో ఎంప్లాయిస్ సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు సిద్ధం కావాలని నూతన కమిటీ పిలుపునిచ్చింది.

నేటి యువతకు భగత్‌సింగ్ స్ఫూర్తి

ఘనంగా పలుచోట్ల భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 94వ వర్ధంతి



వర్ధంతి సభలో నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - భీమవరం

దోపిడీ రహిత సామాజమైన సోషలిజమే భగత్ సింగ్ లక్ష్యమని, ఆ దిశగా యువత పోరాడాలని సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆదివారం స్వాతంత్ర సమరయోధులు, విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 94వ వర్ధంతి ఘనంగా నిర్వహిచారు. ఈ సందర్భంగా అమరుల చిత్రపటాలకు సీతారాం పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీతారాం మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం అతిచిన్న వయసులోనే ఉరికంబాన్ని ముద్దాడి ప్రాణాలర్పించిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల త్యాగం మరువలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు బి.బలరాం, జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబురావు, కేతా గోపాలన్, బి.వాసుదేవరావు, కౌరు పెద్దిరాజు, పివి.ప్రతాప్, జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, గొర్ల రామకృష్ణ, మామిడిశెట్టి రామాంజనేయులు, కె.తవిటి నాయుడు, ముచ్చర్ల త్రిమూర్తులు, సర్నీడు వెంకటేశ్వరరావు, కానేటి బాలరాజు పాల్గొన్నారు.

తణుకు రూరల్ : ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ భారతదేశ విముక్తి కోసం నినదించిన భగత్ సింగ్ నేటి యువతకు స్ఫూర్తిదాయకమని సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్ర రావు, పార్టీ సీనియర్ నాయకులు కర్నాటపు నరసింహారావు అన్నారు. సిపిఎం వేల్పూరు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మినీ బైపాస్ రోడ్‌లో ఉన్న భగత్ సింగ్ సెంటర్ వద్ద ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో వాసా వెంకటేశ్వరరావు, దున్నే నాగేశ్వరరావు, ఒంటెద్దు బసవరాజు, యండమూరి నాగేంద్ర, లంకె నారాయణ, కుడకా వీరభద్రరావు, విశ్వనాథం సుబ్బారావు, కరేళ్ల అర్జున్ తాళ్ల సత్యనారాయణ, అందే కోట బసవయ్య పాల్గొన్నారు.

తణుకు : భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఆశయాల సాధనకు విద్యార్థులు, యువత కృషి చేయాలని, వీరి త్యాగాలు మరువలేవని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్(ఎఐఎస్ఎ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి అన్నారు. భగత్‌సింగ్ విగ్రహానికి మాజీ విద్యార్థి నాయకులు తానేటి అమృత్ పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి విద్యార్థి విభాగం తణుకు నియోజకవర్గ అధ్యక్షులు గోపి ఎడ్వర్డ్‌పాల్, ఎఐఎస్ఎ నాయకులు వి.సుశాంత్, టి.నేహల్, కె.గణపతి, ఎం.గణేష్, బి.చందు, సిహెచ్.సాయి, ఎం.జోసెఫ్ పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది కౌరు వెంకటేశ్వర్లు భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో కండిబోయిన ఆనందకుమార్, ఉడతల పుల్లేశ్వరరావు, బింకం రవికుమార్, పైడి ధనుంజయరావు పాల్గొన్నారు.

నరసాపురం : స్థానిక బస్టాండ్ దగ్గర మీరా గ్రంథాలయం వద్ద డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి సిపిఎం నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. డివైఎఫ్ఐ మాజీ నాయకులు కేతినేడి వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు బూడిదజోగేశ్వరరావు, మంచిలి నీలకంఠం,


తణుకు రూరల్‌లో..

నోముల కొండ, కోడి లక్ష్మణ్, వాసా రామలింగం, పైల అప్పలనాయుడు పాల్గొన్నారు.

గణపవరం : భగత్ సింగ్ ఆశయసాధనకు నేటి యువత కృషిచేయాలని సిఐటియు మండల అధ్యక్షులు ఎం.పెంటారావు అన్నారు. భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన వర్ధంతి సభలో పాల్గొని మట్లాడారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘణంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.త్రినాథ్, చిన్నం చిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం..

ఉండి : స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ భగత్ సింగ్ వర్ధంతి వేడుకల్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. చెరుకువాడ గ్రామంలో భగత్ సింగ్ విగ్రహానికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించి యండగండి గ్రామంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జి.శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కె.రోహిత్, మండల కార్యదర్శి కె.గోవింద్, సహాయ కార్యదర్శి సిహెచ్.సతీష్, ఉపాధ్యక్షులు ఎం.రమాదేవి, సభ్యులు సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

మండలంలోని పాందువ్వ గ్రామంలో భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్.గంగయ్య, ఎం.మహేంద్ర, ఎం.బుజ్జి, ఎం.దుర్గాప్రసాద్, ఎస్.బాలాజీ, ఏసోబు, కళ్యాణ్ బాబి, ఎం.బోసు పాల్గొన్నారు.

మొగల్తూరు : మండల కేంద్రం మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో విప్లవ వీరుడు భగత్ సింగ్ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాగిడి రాంబాబు, అనంతపల్లి అనిల్, పెద్దపాటి వర్మ, తోట శీను, స్నేహ ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.


ఉండిలో..


ఆచంటలో కాగడాల ప్రదర్శన చేస్తున్న డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నేతలు

ఆచంట, ఆకివీడులో కాగడాల ప్రదర్శన

ఆచంట : మతోన్మాదం, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువత ఐక్యంగా ఉద్యమించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ, జిల్లా సహాయ కార్యదర్శి పిల్లి చంటిబాబు పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, బాలల సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సంతమార్కెట్, రామేశ్వరస్వామి సత్రం నుంచి ఆచంట కచేరీ సెంటర్ వరకూ కాగడాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కచేరీ సెంటర్ వద్ద గల భగత్‌సింగ్ విగ్రహం దగ్గర బహిరంగ సభ నిర్వహించారు. తొలుత భగత్ సింగ్ విగ్రహానికి డివైఎఫ్ఐ జిల్లా సహాయకార్యదర్శి పిల్లి చంటిబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు జి.మోహన్ కుమార్, బాలల సంఘం, ప్రజాసంఘాల నాయకులు ఎస్.ప్రజ్వల, టి.మౌనిక, మోహన్ రావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మాజీ మండల కార్యదర్శి కుసుమే జయరాజు, ప్రజా సంఘాల నాయకులు బండి రంగారావు, తోటపల్లి సత్యన్నారాయణ, తలుపూరి బుల్లబ్బాయి, సిర్రా నర్సింహమూర్తి, సిర్రా విఘ్నేశ్వరుడు, మన్నె బ్రహ్మయ్య, తమరాపు జితేంద్ర పాల్గొన్నారు.

ఆకివీడు : భగత్ సింగ్ ఆశయ సాధన కోసం నిరంతరం యువత ముందుండాలని డివైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు డి.రవితేజ, బి.రాంబాబులు పిలుపునిచ్చారు. సంఘ కార్యాలయం నుంచి దొరగారి చెరువు వరకు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్.ప్రసాద్, జి.వెంకటేష్, బత్తిన అప్పారావు, ఎ.సతీష్, బి.రాంబాబు, పెంకి అప్పారావు, కె.తవిటి నాయుడు, బి.రవి వర్మ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి రుణాలకు గడువు పెంపు

పెనుమంట్ర : మండలంలోని స్వయం ఉపాధి కోసం రుణాలకు సంబంధించి దరఖాస్తులకు ఈనెల 25 వరకు గడువు పెంచినట్లు పెనుమంట్ర ఎంపిడిఒ పి.సామ్యూల్ తెలిపారు. ఈనెల 22వ తేదీతో గడువు ముగియవలసి ఉండగా, ఉన్నతాధికారుల ఆదేశాలతో గడువు పెంచినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా కాపు కార్పొరేషన్ రుణాలకు వయోపరిమితి 50 నుంచి 60 సంవత్సరాలకు పెంచడం జరిగిందని ఆయన చెప్పారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు అంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ కోరారు.

పర్యాటక కేంద్రాల సందర్శన

భీమవరం టౌన్ : క్రమశిక్షణ, ఏకాగ్రత, దేశభక్తితో స్కౌట్ ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ దోహదపడతాయని, జాతీయ భావాలను పెంపొందిస్తాయని ఆంధ్రప్రదేశ్ స్కౌట్ గైడ్స్ శిక్షణ ఎల్ఒసి(అమరావతి) డిఎల్.నారాయణ అన్నారు. ఆదివారం గత రోజులుగా భీమవరం బ్రౌనింగ్ జూనియర్ కళాశాలలో 192 మందికి స్కౌట్ గైడ్స్‌పై శిక్షణా శిబిరాన్ని నిర్వహించగా ఆదివారం పర్యాటక కేంద్రాలను సందర్శించారు. దీనిలో భాగంగా 125 అడుగుల విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు, మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానం, పెద అమిరం జైన్ దేవాలయాలను సందర్శించారు. నారాయణ మాట్లాడుతూ స్కౌట్ బాల్యం నుంచి శిక్షణ పొందితే జీవిత గమనంలో ప్రతిభ పాటవాలలో ముందుంటారని, దేశ వ్యాప్తంగా వేలాది పాఠశాలలో స్కౌట్ గైడ్స్ శిక్షణ పొంది సేవా కార్యక్రమాలలో పాల్గొంటున్నారని అన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ నేను కూడా పాఠశాల విద్యార్థిగా స్కౌట్ గైడ్స్ శిక్షణ పొందానని, స్కౌట్‌తో సమన్వయ శాంతి స్వభావాలు కలుగుతాయని తెలిపారు. గరల్స్ ఎల్ఒసి అమృత జ్యోతి(మహబూబ్ నగర్) పాల్గొన్నారు.

ఉల్లాస్ పరీక్షకు నూరుశాతం హాజరు

పెనుమంట్ర : మండలంలోని డ్వాక్రా సంఘాలకు చెందిన 18 గ్రామాల్లో గుర్తించిన నిరక్షరాస్య మహిళలకు ఆదివారం జరిగిన ఉల్లాస్ పరీక్షకు వంద శాతం మహిళలు హాజరై పరీక్షలు రాసారని మండల డ్వాక్రా ఎపిఎం పిప్పళ్ల పద్మ తెలిపారు. ఈమేరకు మండలంలోని 20 ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేసిన 20 పరీక్షా కేంద్రాల్లో 200 మంది డ్వాక్రా మహిళలు హాజరై విజయవంతంగా పరీక్షలు రాసారని ఆమె పేర్కొన్నారు. డ్వాక్రా, వయోజన విద్య సంయుక్తంగా ఉల్లాస్ పేరిట ఈ పరీక్షలు నిర్వహించారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు

తణుకు : సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించు ఇంటింటికీ వైద్యం కార్యక్రమంలో భాగంగా ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, తణుకు, సూర్యారావుపాలెం ప్రాంతాల్లో పర్యటించి ఐదుగురు వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందజేశారు. సూరపనేని సత్యనారాయణ ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు అల్లూరి కరుణాకరచౌదరి, కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

దొమ్మేటి జయంతి వేడుకలు

తణుకు : యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమైన జీవితం గడిపిన దొమ్మేటి వెంకటరెడ్డి అడుగుజాడల్లో యువత నడుచుకోవాలని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం శెట్టిబలిజ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు దొమ్మేటి వెంకటరెడ్డి 172వ జయంతి పురస్కరించుకుని అత్తిలిలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, శెట్టిబలిజ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : తన యావదాస్తిని జాతి అభ్యున్నతి కోసం ఖర్చు చేసిన గొప్ప సంస్కర్త దొమ్మేటి వెంకటరెడ్డి అని మండలంలోని జుత్తిగ టిడిపి నాయకులు వీరవల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఉదయం దొమ్మేటి జయంతి సందర్భంగా వారికి ఘనంగా నివాళులు అర్పించారు. దొమ్మేటి వెంకట రెడ్డి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

పాలకొల్లు : పోరాటస్ఫూర్తి, సమాజ మార్పు కోసం విద్య అవసరమని విద్యకు, వివిధ అభివృద్ధి సేవా కార్యక్రమాలకు తన ఆస్తిని దారపోసిన త్యాగమూర్తి దొమ్మేటి వెంకటరెడ్డి అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కొనియాడారు. ఆదివారం పట్టణంలో దొమ్మేటి వెంకటరెడ్డి 172వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలను వేసి మంత్రి రామానాయుడు ఘనంగా నివాళులు అర్పించారు. నాయకులు కోడి విజయభాస్కర్, మామిడిశెట్టి పెద్దిరాజు, బోనం నాని, చినమిల్లి గణపతిరావు, కడలి గోపాలరావు, గూడూరి హనుమంతరావు పాల్గొన్నారు.

'ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి'

మొగల్తూరు : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని ఆరోగ్య వర్షిని ట్రస్ట్ చైర్మన్ నాగిడి రాంబాబు అన్నారు. మొగల్తూరులోని సంకా సీతారామయ్య అనంతపల్లి ముత్యాలరావు శ్రీవాసవి ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో ఆరోగ్య వర్షిని ట్రస్ట్, ఆర్యవైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల సరియైన అవగాహన కల్పించుకుని పరిరక్షించుకోవాలని ఆయన సూచించారు. ఈ శిబిరంలో భీమవరానికి చెందిన తేజ సూపర్ స్పెషాలిటీ గుండె వైద్య నిపుణులు పొన్నమండ చంద్రశేఖర్ వర్మ, స్త్రీల వైద్య నిపుణులు పొన్నమండ వెంకట మహాలక్ష్మి, విష్ణు దంత వైద్య కళాశాల వైద్య నిపుణులు కెఎస్.చైతన్య రామ్, స్పందన ఆసుపత్రి చెవి, ముక్కు, గొంతు వైద్యనిపుణులు రామకృష్ణ, పాలకొల్లుకి చెందిన నేత్ర కంటి ఆసుపత్రి వైద్యులు వెంకట్రావులు ఈ శిబిరంలో సుమారు 300 మందిని పరీక్షించారు. బిపి, షుగర్, ఇసిజి, ఎకో తదితర పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు సంకా ముత్య రామ నాగేశ్వరరావు, అనంతపల్లి సాయిరామ్, ట్రస్ట్ సభ్యులు వాకాడ ఉమామహేశ్వరరావు, టిడిపి నాయకులు గుబ్బల నాగరాజు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం : నరసాపురం సబ్ కలెక్టరేట్లో ఈనెల 24వ తేదీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు తెలిపారు. డివిజన్లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. సబ్ డివిజన్లోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో యథావిధిగా జరుగుతుందన్నారు. ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులను ఉదయం 10:30 నిమిషాల నుంచి అందించాలని కోరారు.

జ్యుడీషియల్ వేతన సవరణ కమిటీ వేయాలని వినతి

పాలకొల్లు : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 12వ వేతన సవరణ కమిటీని ఏర్పాటు చేసే సమయంలో రిటైర్డ్ ఐఎఎస్ నేతృత్వంలో కమిటీ కాకుండా కేంద్ర ప్రభుత్వంలా జ్యుడీషియల్ వేతన సవరణ కమిటీ నియమించాలని కోరుతూ ఉద్యోగులు రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతి పత్రం సమర్పించారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఎపిజెఎసి) జిల్లా ఉద్యోగులు మంత్రిని పాలకొల్లులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఈ విషయాన్ని పరిశీలిస్తామని మంత్రి తెలిపారు. సచివాలయ సిబ్బంది సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు తాలూకా యూనిట్ అధ్యక్షుడు సునీల్ కుమార్, కార్యదర్శి కృష్ణ కిషోర్, జిల్లా అధ్యక్షుడు జిఆర్ఎస్.రాజు, సంఘ నాయకులు మోహనరావు, ఉమర్ ఆలీషా పాల్గొన్నారు.

నిట్‌లో ఉత్సాహంగా మారథాన్

తాడేపల్లిగూడెం : పరుగు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని ఏపి నిట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ కె.హిమబిందు సూచించారు. నిట్ ఎన్‌సిసి డైరెక్టర్, ప్రొఫెసర్ ఎన్ఎస్.రమణారావు ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి పర్యవేక్షణలో సంస్థలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ క్లబ్ సహకారంతో ఆదివారం మారథాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ శరీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు వ్యాయామం, పరుగు, నడక, యోగా వంటివి ఎంతగానో దోహదం చేస్తాయని, ఇవి సాధన కోసం విద్యార్థులు నిత్యం కొంత సమయాన్ని కేటాయించాలని వివరించారు. అనంతరం నిట్ ముఖద్వారం నుండి బాలికల వసతిగృహం వరకు, అక్కడి నుండి తిరిగి మళ్లీ నిట్ ముఖద్వారం వరకు మారథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆచార్యులు, యువతీ, యువకులు భారీగా తరలివచ్చారు. ఆచార్యులు డాక్టర్ టి.జగన్మోహనరావు, శారదా ప్రసన్న మల్లిక్, సుశాంత్ కుమార్ బెహరా, నాన్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బీచ్‌లో పర్యాటకుల సందడి

మొగల్తూరు : మండలంలోని పేరుపాలెం బీచ్ ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాలలో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాలలో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకు వస్తున్న కెరటాలతో ఇసుకలో ఆడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి, కొబ్బరి తోటలలో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు.

లక్షా 72 వేల పని దినాలు కల్పించడమే లక్ష్యం

15 రోజుల లోపు కూలీలకు వేతనాల చెల్లింపు
మినీ గోకులాలు ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం మండల అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి పిల్లి చిట్టి జయబాబు

చిట్-చాట్

ప్రజాశక్తి - పాలకోడేరు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో ఈ ఏడాది సుమారు లక్ష 72 వేల పనిదినాలు కల్పించడమే లక్ష్యంగా తీసుకున్నట్లు మండల అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి పిల్లి చిట్టి జయబాబు తెలిపారు. కూలీలు పనిచేసిన 15 రోజులు లోపే వేతనాలు చెల్లించడం జరుగుతుందన్నారు. రైతులకు, పాడి రైతులకు ఎంతో ఉపయోగకరంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మినీ గోకులాలు ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే కొన్ని మినీ గోకులాలు ఏర్పాటు చేయడం జరిగిందని, మరికొన్ని పనులు సరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఎన్‌ఆర్‌జిఎస్ పథకం నిర్వహణ, చేకూరుతున్న లబ్ధి, పథకం ఉపయోగాలపై ప్రజాశక్తితో ఆయన ముచ్చటించారు.

ప్రశ్న : మండలంలో ఎన్ని గ్రామాలు ఉన్నాయి? ఎంతమంది కూలీలు ఉన్నారు? ఎన్ని జాబ్ కార్డులు ఉన్నాయి? రోజుకు ఎంతమంది కూలీలు పనిచేస్తున్నారు?

జవాబు : మండలంలో 14 గ్రామాలు ఉన్నాయి. 7 వేల 965 జాబ్ కార్డులు ఉన్నాయి. 8 వేల 739 మంది కూలీలు ఉన్నారు. రోజుకు సరాసరి 600 మంది కూలీలు పని చేయడం జరుగుతుంది.

ప్రశ్న : కూలీలకు రోజుకు వేతనం ఎంత చెల్లిస్తున్నారు?

జవాబు : 2023-24 సంవత్సరంలో పనిచేసిన ప్రతి కూలీకి సరాసరి రోజుకు రూ.272 చెల్లించడం జరిగింది. తర్వాత ఏడాది 2024-2025లో రూ.300 చెల్లించడం జరుగుతుంది.

ప్రశ్న : గత రెండేళ్ల కాలంలో ఎన్ని పనిదినాలు కల్పించారు? ఎంత వేతనాలు చెల్లించారు? మెటీరియల్ కాంపౌండ్ ఎంత చెల్లించారు?



జవాబు : 2023-2024లో లక్ష 53 వేల 742 పనిదినాలు కల్పించడం జరిగింది. రూ.3 కోట్ల 87 లక్షలు వేతనాల రూపంలో, మరో రూ.కోటి 80 లక్షలు మెటీరియల్ కాంపౌండ్ కింద చెల్లించడం జరిగింది. 2024-2025లో లక్ష 29 వేల 87 పనిదినాలు, రూ.3 కోట్ల 54 లక్షల వేతనాలు, రూ.కోటి 32 వేలు కాంపోనెట్ కింద చెల్లించడం జరిగింది.

ప్రశ్న : ఈ యాడాది ఎన్ని పది దినాలు కల్పించాలని లక్ష్యంగా తీసుకున్నారు? ప్రస్తుతం ఎటువంటి పనులు జరుగుతున్నాయి?

జవాబు : 2025-2026 సంబంధించి సుమారు లక్ష 72 వేల పని దినాలు కల్పించడమే లక్ష్యంగా తీసుకోవడం జరిగింది. మండలం వ్యాప్తంగా పంట కాలువలు, పంట బోదులు పొడుగు తీత పనులు జరుగుతున్నాయి.

ప్రశ్న : మినీ గోకులాలు ఏర్పాటు లక్ష్యం ఎంత? ఇప్పటి వరకు ఎన్ని పూర్తి చేశారు? ఎంత చెల్లించారు?

జవాబు : 42 మినీ గోకులాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా తీసుకోవడం జరిగింది. ఇప్పటి వరకు 30 మినీ గోకులాలు పూర్తి అయ్యాయి. మరో 11 వివిధ దశల్లో ఉన్నాయి. ఇప్పటి వరకు సుమారు రూ.12 లక్షల 50 వేలు చెల్లించడం జరిగింది.

ప్రశ్న : మినీ గోకులం షెడ్ ఏర్పాటుకు ఎంత మొత్తం చెల్లిస్తున్నారు?

జవాబు : గోకులం షెడ్డు ఏర్పాటుకు రెండు గేదెలు ఉంటే రూ.లక్ష 15 వేలు, 4 గేదెలు ఉంటే రూ.లక్ష 85 వేలు, ఆరు గేదెలు ఉంటే రూ.2 లక్షల 30 వేలు అందించడం జరుగుతుంది.

ప్రశ్న : ప్రభుత్వ గృహ నిర్మాణానికి ఎన్ని పనిదినాలు కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు ఎన్ని పనిదినాలు కల్పించారు?

జవాబు : ప్రభుత్వం గృహం నిర్మించుకుంటే ఎన్‌ఆర్‌జిఎస్ పథకం ద్వారా 90 రోజులు పనిదినాలు కల్పించడం జరుగుతుంది. 2024-2025కు సంబంధించి లక్ష 65 వేలు మస్తర్లు వేయాలని లక్ష్యం తీసుకోగా ఇప్పటి వరకు సుమారు లక్ష 29 వేల 883 మస్తర్లు పూర్తి చేయడం జరిగింది.

ట్రాన్స్‌జెండర్లు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

భీమవరం : ట్రాన్స్‌జెండర్స్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ అడ్వకేట్ గీత, కావ్య, లలిత అన్నారు. స్థానిక దుర్గాపురం విజ్ఞాన కేంద్రంలో కృష్ణా యువజన సంక్షేమ సంఘం ప్రాజెక్టు డైరెక్టర్ అర్చన ఆదేశాల మేరకు సమస్త ఆధ్వర్యంలో అడ్వకేసి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్వకేట్స్ గీతా, కావ్య, లలితలు ట్రాన్స్‌జెండర్స్ కల్పించిన చట్టాలు, హక్కులపై వివరించారు. సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలు అవగాహన చేసుకోవాలన్నారు. సమాజం చిన్న చూపు చూస్తుందని, వారికి సరైన గుర్తింపు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్స్ సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. గుర్తింపు పత్రాలు పొందడానికి తాము ఎక్కడికో దూరంగా వెళ్లవలసి వస్తుందన్నారు. ఆధార్ కార్డు, పెన్షన్ పొందడంలో కూడా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన సమస్త మేనేజర్ బి.వరప్రసాద్ మీ సమస్యలు పరిష్కరించడానికి తమ సహాయ శక్తులా కృషిచేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌జెండర్స్ పాల్గొన్నారు.



కొట్టుకు పూల బొకే అందజేస్తున్న కోడే విజయలక్ష్మి

మాజీ మంత్రి కొట్టును కలిసిన వైసిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు కోడే

భీమవరం టౌన్ : మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణను జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు కోడె యుగంధర్, వైసిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ మంత్రి సత్యనారాయణ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి కృషిచేసిన పార్టీ వైసిపినేనని, గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం మహిళలకు ఎన్నో పథకాలను అమలు చేసిందని, కూటమి ప్రభుత్వం మహిళలకు ఎటువంటి పథకాలను అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు అవుతున్నా ఉచిత బస్సు, మహిళలకు 15 వేలు వంటి హామీలను మరిచారని విమర్శించారు. మహిళలకు ఎంతో కృషి చేసిన నాయకుడు జగన్మోహన్ రెడ్డి అని తెలిపారు. అందరితో మమేకమై జిల్లాలో మంచి కార్యక్రమాలు చేయాలని అన్నారు. వైసిపి పట్టణ అధ్యక్షులు గాదిరాజు రామరాజు, నాయి బ్రాహ్మణ జెఎసి జిల్లా అధ్యక్షులు పట్నాల గణపతి, కట్టా రవి, బొత్స ధర్మా, మాజీ మంత్రి కొట్టు సత్యనారయణను కలిసిన వారిలో ఉన్నారు.

'నడక ఆరోగ్యానికి మేలు'

మొగల్తూరు : నడక ఆరోగ్యానికి ఎంతో మేలని ఊపిరితిత్తులు, ఛాతి వైద్య నిపుణులు సంకా వెంకట సుబ్రహ్మణ్య పాపారావు అన్నారు. రాజమండ్రిలోని నిత్య క్లినిక్ ఆధ్వర్యంలో మొగల్తూరు 5 కె వాక్‌ను స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు పాపారావు మాట్లాడుతూ మధుమేహం, రక్తపోటు తదితర రోగాలను అదుపులో ఉంచొచ్చు అన్నారు. గుండె, ఎముకలు, కండరాలు బలపడతాయని, మానసిక ఒత్తిడి ఉండదని తెలిపారు. ఈ 5 కే వాక్‌లో అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

'అంబేద్కర్‌ను అవమానపర్చిన వారిని శిక్షించాలి'

ప్రజాశక్తి - నరసాపురం

తూగో జిల్లా నల్లజర్ల మండలం దూబచర్లలో అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించిన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని నరసాపురం నియోజకవర్గ మాలల ఐక్యవేదిక అధ్యక్షుడు కాకిలేటి ఆనంద్ కుమార్ అన్నారు. ఆదివారం నరసాపురం పట్టణం అంబేద్కర్ సెంటర్‌లో నియోజకవర్గ మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కాకిలేటి ఆనంద్ కుమార్, ఇంజేటి జాన్ కేనడీ మాట్లాడుతూ ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలన్నారు. రాజ్యాంగం రచించి అన్ని వర్గాల వారికి రక్షణ కల్పించేలా చట్టాలు చేయడమే అంబేద్కర్ చేసిన తప్పా అని ప్రశ్నించారు. అనంతరం 216 జాతీయ రహదారిపై కూర్చుని నిరసన చేపట్టారు.

అన్నా క్యాంటీన్ స్థల పరిశీలన

ఉండి : ఉండిలో త్వరలో ఏర్పాటు చేయబోయే అన్న క్యాంటీన్‌కు స్థలాన్ని ఆదివారం సాయంత్రం ఉండి ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు అన్న క్యాంటీన్ పట్టణ ప్రాంతాల్లోనే ఉండేదని, కానీ గ్రామీణ ప్రాంతాల్లోనూ అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకు వెళ్లగానే స్పందించిన ఆయన మండల కేంద్రం ఉండి గ్రామంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయటానికి సుముఖం వ్యక్తం చేశారన్నారు. దీనివల్ల త్వరలోనే ఉండిలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, దీనికి కావాల్సిన స్థలాన్ని పరిశీలించి, క్యాంటీన్ నిర్మాణాన్ని వేగవంతం చేస్తామని వారు వివరించారు. మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారంలోని ఇరిగేషన్ డ్రైన్స్ భూములు ఆక్రమణలకు గురయ్యాయని సిపిఎం నాయకులు ఆరోపించిన నేపథ్యంలో వాటిని కనుమూరి రఘురామకృష్ణంరాజు పరిశీలించారు. అనంతరం డ్రెయినేజీ ఇరిగేషన్ భూములను సర్వే జరిపించి, ఆక్రమణలు ఉన్నట్లయితే వెంటనే వాటిని స్వాధీనం చేసుకోవాలని సంబంధిత అధికారులను రఘురామకృష్ణంరాజు ఆదేశించారు. చెరువుగట్టుపాలెం ప్రాంతాన్ని పరిశీలించారు. పొలాలకు వెళ్లి పంట ఎగుమతి చేసేందుకు వీలు లేకుండా కొందరు ఇల్లు నిర్మించుకున్నారని రఘురామకృష్ణంరాజుకి తెలపగా రైతులకు ఇబ్బందులుగా ఉన్న ఆక్రమణలు వెంటనే తొలగించాలని అధికారులకు ఆదేశించారు. ఉండి డిసి చైర్మన్ తోట ఫణి, వైస్ చైర్మన్ మంతెన సాయిలచ్చిరాజు, టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు బధిరుల ఎంపిక హర్షణీయం

ఎంఎల్ఎ అంజిబాబు



ఎంపికైన వారిని అభినందిస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

హర్యానాలో ఏప్రియల్ 9 నుంచి 25వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి బధిరుల (మూగ, చెవుడు) క్రికెట్ పోటీలకు 16 మంది ఎంపిక కావడం అభినందనీయమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. ఆదివారం జిల్లా అసోసియేషన్ నుంచి ఎంపికైన బధిర క్రీడాకారులను ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో ఎంఎల్ఎ అంజిబాబు ఆదివారం అభినందించారు. జిల్లా బధిర అసోసియేషన్ గౌరవాధ్యక్షులు చెరుకువాడ రంగసాయి, అధ్యక్ష, కార్యదర్శులు ఎంకె.రాజు, సిహెచ్.తాతారావు మాట్లాడుతూ 3 సార్లు బధిర క్రీడాకారులు రాష్ట్ర, అంతరాష్ట్ర పోటీల్లో పాల్గొన్నారని, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను ప్రోత్సహిస్తూ బాంబే స్వీట్స్ అధినేత పొత్తూరి బాపిరాజు రూ.10 వేలు సహకారం అందించారని తెలిపారు. కార్యక్రమంలో వబిలిశెట్టి రామకృష్ణ, భీమాల శ్రీరామ్మూర్తి, కారుమూరి సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలి

ట్రస్ట్ ఛైర్మన్ నల్లా సత్యకృష్ణ కిరణ్ ప్రసాద్

ప్రజాశక్తి - ఉండి

ప్లాస్టిక్ వాడకాన్ని నివారించండి, కేన్సర్ నుంచి విముక్తి పొందండి అని విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నల్లా సత్యకృష్ణ కిరణ్ ప్రసాద్ అన్నారు. ఆదివారం ఉండి ప్రధాన పంటకాలువ ఇరువైపులా ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేత కార్యక్రమాన్ని విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వారానికి ఒక ప్రాంతంలో నివసించే వారికి, దుకాణదారులకు అవగాహన కల్పించి డిసెంబర్ 31వ తేదీకి ప్లాస్టిక్ రహిత గ్రామంగా ఉంచాలనేదే తమ ఉద్దేశమని ఆయన వివరించారు. ప్లాస్టిక్ మానవ శరీరంలోకి ప్రవేశించి కేన్సర్ కారకంగా మారుతుందని, దీనివల్ల మానవాళి మనుగడ ప్రశ్నార్థకమవుతుందన్నారు. ఇటీవల తూర్పుగోదావరి జిల్లాలో ఒక గ్రామంలో కేన్సర్ పరీక్షలు నిర్వహించగా వారిలో 23 మందికి కేన్సర్ నిర్ధారణ అయిందని, అక్కడే అధికారులు వెల్లడించారన్నారు. ఈ కేన్సర్ మూడో దశలో వ్యాధిగ్రస్తునికి తెలుస్తుందని, దీనివల్ల కేన్సర్‌తో పోరాడలేక చనిపోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఇప్పటినుంచే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి కేన్సర్ బారిన పడకుండా ఉండాలని ఆయన కోరారు. భూమిలోకి కలవని ప్లాస్టిక్ వల్ల తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉందని, ప్రతి ఒక్కరూ బయటికి వెళ్లేటప్పుడు క్లాత్ బ్యాగ్ కానీ, జ్యూట్ బ్యాగు గాని తప్పకుండా తీసుకువెళ్లాలని, దీనివల్ల మన ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు ప్లాస్టిక్ తీసుకురాకుండా తగు చర్యలు తీసుకోగలుగుతామని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐక్య నేషనల్ ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీనివాసాచార్యులు, మారెళ్ల కామేశ్వరి, దాసరి వరదరాజు, స్వామి నాయుడు, పసుపులేటి ప్రసాద్, కాగిత మాతయ్య, సోము లీల పాల్గొన్నారు.

తాబేళ్ల రక్షణకు చర్యలు

ప్రజాశక్తి - నరసాపురం



తాబేళ్ల పిల్లలను బీచ్‌లో వదులుతున్న ఫారెస్ట్ అధికారులు

పశ్చిమ తీరంలో ఆలివ్ రెడ్లీ తాబేళ్ల మృత్యువాతపై వాటి సంరక్షణకు జిల్లా కలెక్టర్ సిహెచ్.నాగరాణి చర్యలు చేపట్టారు. ఫారెస్ట్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో మండలంలోని చినమైనవానిలంక గ్రామం సముద్ర తీరంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక హేచరీలో మొదటి దశలో 34 తాబేళ్ల పిల్లలు గుడ్ల నుంచి ఉత్పత్తి అయ్యాయి. వీటిని ఫారెస్ట్ అధికారులు సముద్రంలోకి వదిలారు. ఆలివ్ రేడ్లీ తాబేళ్ల డిసెంబర్ నెల నుంచి మూడు నెలలు గుడ్లు పెట్టేందుకు సముద్ర తీరానికి వస్తువుంటాయి. అవి పెట్టిన గుడ్లను ఫారెస్ట్ అధికారులు సేకరించి హెచరీలో పిల్లలు ఉత్పత్తి అయ్యేలా చర్యలు చేపట్టారు. అంతరించిపోతున్న ఆలివ్ రెడ్లీ తాబేళ్ల సంరక్షణకు ప్రభుత్వం చేపట్టిన చర్యలపై వన్య ప్రాణుల సంరక్షణ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నరసాపురం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎస్.సురేష్, బీట్ ఆఫీసర్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

క్రికెట్ ఆడిన పోలీసులు

నరసాపురం : నిత్యం పోలీస్ స్టేషన్‌లో బందోబస్తులో బిజీగా ఉండే పోలీసులు ఆదివారం సరదాగా బ్యాట్ పట్టుకుని క్రికెట్ ఆడారు. నరసాపురం పట్టణంలోని వైఎన్ కళాశాల గ్రౌండ్లో నరసాపురం డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద ఆధ్వర్యంలో క్రికెట్ ఆడారు. నరసాపురం సబ్ డివిజన్ స్థాయి టీం, పెనుగొండ సర్కిల్ టీంగా విడిపోయి మ్యాచ్ ఆడారు. నరసాపురం సబ్ స్టేషన్ టీంకి డిఎస్‌పి శ్రీవేద కెప్టెన్‌గా వ్యవహరించగా పెనుగొండ టీంకు పెనుగొండ సిఐ రాయుడు విజయ్ కుమార్ కెప్టెన్‌గా వ్యవహరించారు. ముందు బ్యాటింగ్‌కు దిగిన డిఎస్‌పి టీం 86 పరుగులు చేయగా సెకండ్ బ్యాటింగ్ దిగిన పెనుగొండ టీం 56 పరుగులకు ఆలౌట్ అయింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా పాలకొల్లు ఎస్ఐ పృథ్వీ బహుమతి గెలుచుకున్నారు. అనంతరం డిఎస్‌పి బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి శ్రీవేద మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అన్నారు. త్వరలో నరసాపురం సబ్ డివిజన్ స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిఎస్‌పి కె.మానస, నరసాపురం టౌన్ సిఐ బి.యాదగిరి పాల్గొన్నారు.